
## నరసింహుని సేవలో సీపీ రాజశేఖర్‌బాబు



7 లో


# మనం



కృష్ణా / గుంటూరు

ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు



సోమవారం | 24 | ఆగస్టు | 2026 | పేజీలు: 10




- ఉద్యోగుల ఉత్సాహానికి క్రీడలే ఊతం
- ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం.. క్రీడలతోనే సాధ్యం
- టీమ్ స్పిరిట్‌తో విధుల్లోనూ మెరుగైన పనితీరు
- ఉద్యోగుల మధ్య ఐక్యత, స్నేహభావానికి ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ వేదిక
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్

# క్రీడలతో ఆరోగ్యం .. పదిలం...

4 లో

**పి.మీరాహుస్సేన్ ఖాన్**

యునైటెడ్ తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్-ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల మెగా క్రికెట్ టోర్నమెంట్ (ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్) పోటీలు ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఇబ్రహీంపట్నం మండలం, మూలపాడులోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ఉత్సాహభరితంగా జరిగాయి. టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు.

-విజయవాడ, మనంబ్యూరో



3 లో

# ఆదర్శప్రాయుడు... టంగుటూరి

- ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి
- జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి

# నిరంతరం ప్రజా సేవలో... ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్

5 లో



- పేదలకు సహాయం అందించడమే ట్రస్ట్ ముఖ్య ఉద్దేశం.
- ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు,ఉచితంగా మందుల పంపిణీ.
- ప్రజలకు సేవ చేయడమే అమ్మ చూపిన మార్గం
- డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

## టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఘన నివాళులు

- ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు టంగుటూరి
- వియంసి.అదనపు కమిషనర్ ఏ రవీంద్రరావు





విజయవాడ,ఆగష్టు, 23,(మనం న్యూస్): విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా వియంసి అదనపు కమిషనర్ ఏ రవీంద్రరావు ఆదివారం ఉదయం సిబ్బందితో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ ఏ. రవీంద్రరావు మాట్లాడుతూ, టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, ప్రజా నాయకుడిగా, ఆంధ్ర ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని అన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ధైర్యసాహసాలతో ముందుండి పోరాడారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలను చైతన్యపరిచే క్రమంలో ఆయన చూపిన ధైర్యం, నిబద్ధత, త్యాగం భారత స్వాతంత్ర్య చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. ప్రజల కోసం తన వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి నిరంతరం సేవ చేసిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగం, ధైర్యం, నిజాయితీ, ప్రజాసేవా స్ఫూర్తిని స్మరించుకోవడం ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## పారిశుద్ధ్య ప్రమాణాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- నగరంలోని పలు హోటళ్ళు,రెస్టారెంట్ల ఆర్వో ప్లాంట్లపై ప్రజా ఆరోగ్య సిబ్బంది ఆకస్మిక తనిఖీలు

విజయవాడ,ఆగస్టు, 23,(మనం న్యూస్): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగర పరిధిలోని హోటళ్లు, వాటర్ ప్లాంట్లలో పారిశుద్ధ్య విభాగం అధికారులు ఆదివారం ఉదయం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా సర్కిల్ 1 పరిధిలోని కాళేశ్వర రావు మార్కెట్, కెనాల్ రోడ్, తారాపేట, సర్కిల్ 2 పరిధిలోగల రెడ్ సర్కిల్, సీతారాంపురం, గవర్నర్పేట మరియు సర్కిల్ 3 పరిధిలోగల బెంజ్ సర్కిల్, ఎంజీ రోడ్, ఈనాడు ప్రాంతాలలో గల హోటళ్ళు,రెస్టారెంట్లు, ఆర్వో ప్లాంట్లు తనిఖీ చేసి, అక్కడి పరిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ విస్తృత తనకి లో భాగంగా వ్యాపారస్తుల కిచెన్ రూమ్ లో పారిశుద్ధ్య పరిస్థితులు, వ్యర్థాల నిర్వహణ, త్రాగునీరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీల సందర్భంగా కొన్ని సంస్థల్లో పారిశుద్ధ్య లోపాలను అధికారులు గుర్తించారు. సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, గుర్తించిన లోపాలను నోటీసులు అందుకున్న తేదీ నుంచి మూడు రోజుల్లోగా పూర్తిస్థాయిలో సరిదిద్దుకోవాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించిన రెండు హోటళ్లపై జరిమానాలు విధించి, మొత్తం రూ.10,000/- జరిమానాను వసూలు చేశారు. నిర్ణీత గడువులోగా లోపాలను సరిదిద్దుకోని సంస్థలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రేడ్ లైసెన్సులు రద్దు చేసే చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా హోటళ్లు, ఆహార సంస్థలు మరియు వాటర్ ప్లాంట్లు తప్పనిసరిగా పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించాలని అధికారులు సూచించారు. నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహించే సంస్థలపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో జోనల్ కమిషనర్ కె ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్లు సోమరాజు, సలీం, రమేష్ మరియు శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.





## పీజీఆర్ఎస్‌పై స్పందనకు ప్రత్యేక క్యూఆర్ కోడ్






- ఈ నెల 24న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,ఆగష్టు,23,(మనం న్యూస్): ఈ నెల 24వ తేదీ సోమవారం కలెక్టరేట్లో ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం ... పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని.. అదే విధంగా అర్జీదారులు తమ స్పందన తెలియజేసేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ను అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంతో పాటు డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ సూచించారు.

## చదరంగం కదిలింది.. బాల మేధస్సు వెలిగింది!

- 200 మందికిపైగా విద్యార్థులతో చెస్ టోర్నమెంట్
- విజేతలకు బహుమతులు అందజేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ,ఆగష్టు, 23,(మనం ప్రతినిధి): రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ అమరావతి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సమన్వయంతో పాఠశాల స్థాయి బాలబాలికల కోసం ఒకరోజు రాపిడ్ చెస్ టోర్నమెంట్ను జిల్లా కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు.ఉదయం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ అమరావతి చార్టర్ ప్రెసిడెంట్ డా. కొడాలి వల్లి, చార్టర్ సెక్రటరీ డా. హిమబిందు, డా. ఐశ్వర్య యలమంచిలి చెస్ టోర్నమెంట్ను ప్రారంభించారు. ఈ పోటీని మొత్తం 7 రౌండ్లలో నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 200 మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ చెస్ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలో మొత్తం 25 బహుమతులతో పాటు నగదు బహుమతులు విజేతలకు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు అందించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలను ఎంతో ఓర్పుతో చెస్ పోటీలకు తీసుకువచ్చిన తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఏకాగ్రత, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించడంలో చెస్ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందడుగు వేసిన రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ అమరావతి బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఓపెన్ కేటగిరీలో ప్రథమ బహుమతి: విజ్జి హేమంత్ కుమార్, ద్వితీయ బహుమతి: గాజుల మేఘశ్యాం సాయి, తృతీయ బహుమతి: నందగోపాల్ సాధించారు. అంతర్జాతీయ రేటెడ్ చెస్ కోచ్లు కె.సురేష్, యు.దాసు టోర్నమెంట్ను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. రామ్ చంద్, పి. అప్పారావు, శివ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి తమ సేవలను అందించారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో చెస్ క్రీడపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి మేధో సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్ను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉయ్యూరులో డయేరియా పరిస్థితిపై ఇన్చార్జి కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- సానిటేషన్ చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశం





ఉయ్యూరు, ఆగస్టు 23,(మనం న్యూస్): ఉయ్యూరు పట్టణంలో డయేరియా లక్షణాలతో బాధపడుతున్న ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించేందుకు, అలాగే అత్యధికంగా కేసులు నమోదైన 5వ వార్డులో చేపడుతున్న వైద్య, పారిశుద్ధ్య చర్యలను సమీక్షించేందుకు కృష్ణా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శ్రీ ఎం. నవీన్ ఆదివారం ఉయ్యూరులో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మొదటగా ఉయ్యూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్సి)ను సందర్శించిన ఇన్చార్జి కలెక్టర్, డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ, డయేరియా లక్షణాలతో మొత్తం 23 మంది రోగులు ఆసుపత్రిలో చేరగా, వారిలో 9 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న రోగులందరూ స్థిరమైన ఆరోగ్య పరిస్థితిలో ఉన్నారని, అవసరమైన వైద్య సేవలు నిరంతరం అందిస్తున్నామని వివరించారు. అనంతరం ఇన్చార్జి కలెక్టర్ ఉయ్యూరు పట్టణంలోని 5వ వార్డు ప్రాంతాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మురుగునీటి పారుదల, చెత్త తొలగింపు, డ్రైన్ శుభపరిచే పనులు, క్లోరినేషన్ వంటి చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే 5వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆయన, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని, అవసరమైన వారికి తక్షణమే వైద్య సేవలు అందించాలని, తాగునీటి పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. డయేరియా వ్యాప్తి నివారణకు వైద్య, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి పారిశుద్ధ్య చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని ఇన్చార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ దాష్టీకాలపై 'ఆంధ్రకేసరి' స్ఫూర్తితో పోరాడుతాం




- మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలు

**తాడేపల్లి,ఆగష్టు,23,(మనం ప్రతినిధి):** రాష్ట్రంలో నడుస్తున్న పోలీస్ రాజ్యానికి, ప్రభుత్వ దాష్టీకాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి ఆంధ్రకేసరి స్ఫూర్తితో పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఉద్ఘాటించారు. ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే శ్రీ మల్లాది విష్ణు.. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ బ్రిటీష్ సామ్రాజ్యంపై రాజీలేని పోరాటం చేసిన ధీరోదాత్తుడు టంగుటూరి అని కొనియాడారు. ప్రకాశం జిల్లాలో జన్మించి, లండన్లో బారిస్టర్ చదివిన ఆయన.. సైమన్ కమిషన్కు వ్యతిరేకంగా తుపాకులకు ఎదురొడ్డి నిలిచిన తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అని కీర్తించారు. రాజమండ్రి మున్సిపల్ చైర్మన్గా, మద్రాస్ ప్రెసిడెన్సీలో రెవెన్యూ మంత్రిగా రైతులకు, విద్యార్థులకు, మహిళలకు ఆయన చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు. 'స్వరాజ్యం' పత్రిక ద్వారా జాతీయోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, క్విట్ ఇండియా ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తుచేశారు.

### ప్రజల పక్షాన నిలబడతాం..

వైఎస్ జగన్ గారి నేతృత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ప్రకాశం పంతులు బాటలోనే పయనిస్తోందని మల్లాది విష్ణు స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న పోలీస్ రాజ్యానికి, ప్రభుత్వ దాష్టీకాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని ఉద్ఘాటించారు. ఆంధ్రకేసరి స్ఫూర్తితో అడుగులో అడుగు వేస్తూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా స్పష్టం చేస్తూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి, వివిధ విభాగాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 'జోహార్ టంగుటూరి ప్రకాశం పంతులు' అంటూ నినాదాలు చేశారు.

# ఆదర్శప్రాయుడు టంగుటూరి



- ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి
- జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి

**గుంటూరు, ఆగస్టు 23(మనం ప్రతినిధి):** గుంటూరు కలెక్టరేట్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి,టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్ సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దుర్గా భాయి,కలెక్టరేట్ ఏఓ మల్లీశ్వరి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీఆర్ఓ ఖాజావలి మాట్లాడుతూ, టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా,ప్రజా నాయకుడిగా దేశానికి, రాష్ట్రానికి విశిష్ట సేవలందించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ధైర్యసాహసాలతో పాల్గొని ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. బ్రిటిష్ సైనికులు తుపాకులు గురిపెట్టినా వెనుకడుగు వేయకుండా తన గుండె చూపించి నిలబడిన ధైర్యానికి గుర్తుగా ఆయనకు 'ఆంధ్రకేసరి' అనే బిరుదు లభించిందన్నారు. ప్రజల హక్కులు,స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని తెలిపారు.ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కూడా ప్రజలకు సేవలందించిన ఆయన పరిపాలనా దక్షత, ప్రజాసేవా దృక్పథం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని డీఆర్ఓ పిలుపునిచ్చారు.దేశం కోసం, ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.



# వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆకస్మిక దాడులు

- నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు
- వైద్యశాఖ అధికారులు





**విజయవాడ,ఆగష్టు,23,(మనం న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ.శ్రవణ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ వారి ఆదేశాలు ప్రకారం ఆదివారం గిరిపురం- ఈట్ స్ట్రీట్ నందు, మొగల్రాజపురం, దుర్గాపురం మరియు రాజరాజేశ్వరి పేట నందు, మాంసం దుకాణాలు, చికెన్ దుకాణాలు, పానీపూరి బండ్లు,చాట్ మసాలా బండ్లు, ఫ్రూట్ జ్యూస్ స్టాల్స్, త్రాగునీటి ఆర్వో ప్లాంట్లు, నందు విస్తృత తనిఖీలు నిర్వహించుట జరిగినది. ఈ తనిఖీల్లో భాగంగా ప్రతిచోట, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి పరిశుభ్రత, ఆహార పదార్థాల పరిశుభ్రత, చేతులు యొక్క పరిశుభ్రత, పరిశీలించి, వీటన్నిటినీ సక్రమంగా నిర్వహించకపోతే ప్రజలకు ఆరోగ్య భంగం కలుగుతుందని, అతి సార కేసులు ప్రబులుతాయని, తెలియపరుస్తూ వారిని సక్రమ పద్ధతిలో ప్రజలకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను మరియు త్రాగునీటినీ మాత్రమే అందించాలని, లేనిపక్షంలో సంబంధిత శాఖల ద్వారా శిక్షకు గురి కాగలరని హెచ్చరించుట జరిగినది. ఇదే క్రమంలో ప్రతి ప్రోగ్రాం ఆఫీసురు వారి పరిధిలో ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి, మరీ ముఖ్యంగా త్రాగునీటి పరిశుభ్రతపై ఆహార పదార్థాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పరిశీలించాలని, ఏ ఒక్క అతి సార కేసు రిపోర్ట్ అయిన వెంటనే, సోర్స్ ఆఫ్ కంటమినేషన్ అన్వేషించి, తక్షణ చర్యలు చేపట్టి ఉన్నతాధికారులకు తెలియపరచాలని ఆదేశించడం జరిగినది.




# ముత్యాలమ్మ పోతురాజు దేవస్థానానికి భూమి పూజ

- ఐతవరం గ్రామ ఆధ్యాత్మిక అభివృద్ధికి మరో ముందడుగు

**నందిగామ,ఆగష్టు23(మనం న్యూస్):** నందిగామ మండలం ఐతవరం గ్రామంలో ఆదివారం నూతన ముత్యాలమ్మ పోతురాజు దేవస్థానం నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. నూతన దేవస్థానం నిర్మాణం త్వరితగతిన పూర్తై ప్రజలకు ఆధ్యాత్మికంగా మరింత ఉపయోగకరంగా ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. గ్రామంలో భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతను పెంపొందించేలా దేవస్థానాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందనిసందర్భంగా నాయకులు తెలిపారు.



# ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు



**నందిగామ,ఆగస్టు23(మనం న్యూస్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నందిగామ టౌన్ పోలీసులు ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేశారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్టు మరియు గతంలో వివిధ నేరాలకు పాల్పడిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు నందిగామ టౌన్ సీఐ పి. శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా నందిగామ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షీట్ హోల్డర్స్ను ఉద్దేశించి సీఐ పి. శ్రీను మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్టు మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి గొడవలు, బెదిరింపులు, దాడులు, గుంపులుగా చేరి అశాంతికి కారణమయ్యే చర్యలు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వ్యక్తిగత విభేదాలను ఎన్నికల సమయంలో గొడవలుగా మార్చుకోవద్దని సూచించారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడానికి ప్రయత్నించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా, ఎన్నికల ప్రక్రియలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మకుండా, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించినప్పుడు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలి. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదు అని సీఐ పి. శ్రీను పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నందిగామ టౌన్ ఎస్సై కే. సూర్య వంశీ , మరియు నందిగామ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యం ..పదిలం..

- **ఉద్యోగుల ఉత్సాహానికి క్రీడలే ఊతం**
- **ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం.. క్రీడలతోనే సాధ్యం**
- **టీమ్ స్పిరిట్‌తో విధుల్లోనూ మెరుగైన పనితీరు**
- **ఉద్యోగుల మధ్య ఐక్యత, స్నేహభావానికి ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ వేదిక**
- **జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్**




**(విజయవాడ,మనం బ్యూరో):** యునైటెడ్ తెలుగు జర్నలిస్ట్ అసోసియేషన్-ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల మెగా క్రికెట్ టోర్నమెంట్ (ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్) పోటీలు ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఇబ్రహీంపట్నం మండలం, మూలపాడులోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ఉత్సాహభరితంగా జరిగాయి. టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్లో ఇరిగేషన్-1, ఇరిగేషన్-2, ఎడ్యుకేషన్, రెవెన్యూ, సెక్రటేరియట్-1, పంచాయతీరాజ్, ఏపీ ఎన్జీవో-1, ఏపీ ఎన్జీవో-2, మున్సిపల్, సెక్రటేరియట్-2 మొత్తం పది జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్లో ఏపీ ఎన్జీవో, స్కూల్ ఎడ్యుకేషన్ జట్లు తలపడగా ఏపీ ఎన్జీవో జట్టు టైటిల్ ను చేజిక్కించుకుంది. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ టీం నిర్ణీత 16 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 149 పరుగుల దగ్గర ఆగిపోవడంతో సూపర్ ఓవర్ ఆడాల్సి వచ్చింది. సూపర్ ఓవర్లో ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ జట్టు ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ క్రీడలు ఉద్యోగులలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నిరంతరం విధి నిర్వహణలో ఒత్తిడికి లోనయ్యే ఉద్యోగులకు క్రీడలు మంచి విరామాన్ని అందించడంతో పాటు ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంచుతాయని పేర్కొన్నారు. క్రికెట్ వంటి జట్టు క్రీడలు టీమ్వర్క్, నాయకత్వ లక్షణాలు, సమన్వయం, పరస్పర సహకారం, నిర్ణయ సామర్థ్యం వంటి గుణాలను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యాలయాల్లో కూడా సమష్టిగా పనిచేసే వాతావరణాన్ని క్రీడలు బలోపేతం చేస్తాయని అన్నారు. ఉద్యోగులు విధులతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, పాల్గొన్న ఉద్యోగులను అభినందించారు.క్రీడా స్ఫూర్తితో ఉద్యోగుల్లో ఐక్యత - ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐక్యత, ఆత్మీయతను పెంపొందించడంలో క్రీడలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగులు రోజువారీ విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి ఉత్సాహంగా పనిచేయడానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. విజయం సాధించాలనే పట్టుదలతో పాటు ఓటమిని స్వీకరించే మనస్తత్వం, క్రమశిక్షణ, సమయపాలన, సహచరులపై నమ్మకం వంటి విలువలను క్రీడలు నేర్పుతాయని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమానికి ఏపీ ఎన్జీవో సంఘం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, ఇలాంటి క్రీడా కార్యక్రమాలను మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్లో ఉత్సాహంగా పాల్గొన్న అన్ని జట్లను అభినందిస్తూ, విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్,ఖీఒఅ అసోసియేషన్ నిర్వాహకులు పి.రమేష్ బాబు, సాయికృష్ణ, చిన్ని, అజయ్ ఏపీ ఎన్ జి ఓ నాయకులు రజనీష్ బాబు, ఎం.రాజ్యలక్ష్మి పి.జానకి డి.సత్య నారాయణరెడ్డి పి.రమేష్, వివి ప్రసాద్, జి రామకృష్ణ, కె.శివలీల, శ్రీదేవి ఉద్యోగులు, క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# హిందువుల పరిరక్షణ అధికారులకు పట్టదా..?

**హిందువుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యంలో ఎన్నుకోబడినటువంటి నాయకులు దీనిపై స్పందించరా ..??**

**నందిగామ,ఆగస్టు(మనం న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా నందిగామ శ్రీ సుఖశామలాంబా సమేత రామలింగేశ్వర స్వామి వారికి సంబంధించిన కోనేరు పుష్కరిణి అంశం గత ఐదు ఆరు సంవత్సరాలుగా కోర్టు లో కేసు వేసి ఎంతో పోరాడి గెలిచి కోనేరు ఆక్రమణలు తొలగించి శివాలయానికి ఆ భూమిని అప్పజెప్పమని హైకోర్టు ఆర్డర్ వచ్చింది కానీ ఎమ్మార్వో, ఆర్డీవో పట్టించుకోలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలని గత ఐదారు నెలలుగా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో దీనిపై కాలయాపన చేస్తున్నారు. అని హిందూ సంఘాల ఆధ్వర్యంలో 30 రోజులపాటు రోజుకి ఒక రకమైన నిరసన కార్యక్రమాలు చేసినప్పటికీ అధికారులు నుంచి ఎటువంటి స్పందన రాలేదు. జూన్ నెల 26వ తేదీ కలెక్టర్ ఆఫీస్ వద్దకు వెళ్ళినప్పుడు అతి త్వరలో ఈ కోనేరు ఆక్రమణలు తొలగిస్తామని చెప్పినారు. అప్పటినుండి హిందూ సంఘాలు నిరసనలు ఆపాయి.ఆపి మూడు నెలలు గడిచినప్పటికీ మరల అధికారులు దానిపై ఎటువంటి స్పందన లేదు. ఈరోజు రామాలయంలో హిందూ సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో మీటింగ్ ఏర్పాటు చేసి ఈ కోనేరు అంశంలో రేపటి నుంచి ప్రతి ఇంటికి కూడా ఈ అంశాలన్నీ తెలియపరచి డోర్ టు డోర్ పాంప్లెట్ రూపంలో ప్రతి ఒక్క హిందువుకి తెలియపరుస్తామని హిందువుల యొక్క ఓట్లు అన్నీ నోటా కి వేస్తామని హిందువులు అందరూ వేయాలని తెలియపరుస్తూ అదేవిధంగా స్వామివారికి నిత్యకైంకర్యాలు జరిపి భక్తుల దర్శనాన్ని కూడా నిలిపివేస్తామని మరియు నిరసన కార్యక్రమాల్లో భాగంగా నిరాహార దీక్షలు కూడా చేపడతామని ఈ యొక్క కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. హిందువులందరూ కూడా తమ వంతు బాధ్యతగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా హిందూ సంఘాల జేఏసీ కోరుచున్నాయి. హిందువుల పరిరక్షణ అధికారులకు పట్టదా..?హిందువుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యంలో ఎన్నుకోబడినటు వంటి నాయకులు దీనిపై స్పందించరా ..?? ఈ కోనేరు పుష్కరిని పూర్తయితే ఆ భగవంతుడి ఆశీస్సులు ప్రజలందరికీ కూడా మెండుగా ఉంటాయి . ఈ కోనేరు పుష్కరిని పూర్తయితే నందిగామ భూగర్భ జలాలు ఇంకిపోకుండా నీళ్లు పుష్కలంగా లభిస్తాయి. ఈ కోనేరు పుష్కరిని పూర్తయితే స్వామివారి తెప్పోత్సవం జరిగితే గ్రామమంతా సుభిక్షంగా ఉంటుంది. ఒకచోట శివుడికి అభిషేకాలు నిర్వహిస్తూ ఉంటే ఎంతో గొప్పగా పూజలు జరుగుతూ ఉంటే అదే శివాలయానికి సంబంధించిన మరొక కోనేరు లో శివలింగానికి మరుగునీరు ప్రవహిస్తుంది. దానిలో నందిగామలో ఉన్నటువంటి చెత్తాచెదారం మురుగునీరు ప్రవహిస్తుంటే అధికారులు హిందువులు నిద్రపోతున్నారా....?? నందిగామలో 70 సంవత్సరాల నుంచి శివాలయం వద్ద కొంతమంది హిందూ సోదరులు వాళ్లు సొంతంగా షాపులు కట్టుకొని భగవంతుడికి అద్దెలు కట్టినప్పటికీ ఇది గుడి కి దేవుడికి అవసరం అని చెప్పిన వెంటనే అందరూ హిందువులు ఆ షాపులను వెంటనే ఖాళీ చేసి దేవునికి అప్పజెప్పి వెళ్లారు. మరొక అంశం శివాలయానికి దక్షిణ వైపు బాగాన ఉన్నటువంటి బాగాన కొన్ని సంవత్సరాల నుంచి వారు దారి ఏర్పరచుకున్నప్పటికీ ఇది దేవుని భూమి అని రికార్డు తేల్చిన వెంటనే దానిని కూడా వారు స్వచ్ఛందంగా వదిలేసి వెళ్లారు. కానీ ఈ పుష్కరణిలో ఆక్రమించినటువంటి ప్రజలు ఎవరైతే ఉన్నారో మీరు దయచేసి ఇప్పటికైనా దేవుడికి సంబంధించినటువంటి కోనేరు ఆస్తిని మీరు దేవునికి అప్పగించి నందిగామలో ఉన్నటువంటి కొన్ని వేల మంది హిందువులకి మీరు కూడా సహకరించి భగవంతునికి అప్పచెప్పి వదిలేసి వెళ్లాలని ఈ సందర్భంగా మేము కూడా కోరుతున్నాం మీరు దీంట్లో ఇంకా ఏదైనా తప్పులు వహించాలి అనుకుంటే ఈ కార్యక్రమాలపై ఉధృతం జరుగుతది అది మీరు దృష్టిలో పెట్టుకొని ప్రజలంతా కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని హిందువులంతా ఏక తాటిపైకి రావాలని ప్రతి ఒక్కరిని కోరుతున్నాం. గత కొంతకాలంగా ప్రజలకు అవసరమైన అన్ని కార్యక్రమాలకు ఎంతో విలువైన దేవుడి భూమి ని ప్రజల అవసరాల కోసం ఇచ్చినారు ఉదాహరణకి ఎన్ఎస్పీ కాలనీ జడ్పీహెచ్ స్కూలు నందిగామ చందర్లపాడు రోడ్డు ఇంకా కొన్ని కాలనీలు ఇన్ని రకాలుగా ఎంతోభూమిని ప్రజల అవసరాలకు ఇచ్చినప్పటికీ దేవుడి కి అవసరమైన భూమిని మాత్రం ఎందుకు తిరిగి దేవుడికి ఇవ్వట్లేదు దీని మీద ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు అని ప్రశ్నిస్తున్నారు.






# నిరంతరం ప్రజా సేవలో...

# ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్

**పేదలకు సహాయం అందించడమే ట్రస్ట్ ముఖ్య ఉద్దేశం**

**ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు,ఉచితంగా మందుల పంపిణీ**

**ప్రజలకు సేవ చేయడమే అమ్మ చూపిన మార్గం**

**డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి**

**మార్కాపురం,ఆగస్టు, 23,(మనం న్యూస్):** పేదలకు నిరంతరం సేవ చేయడం,చేయూత అందించడం,పేదల అభ్యున్నతికి నిరంతరం తపించడమే నిజమైన మానవత్వమని తన తల్లి చూపిన మార్గమే సేవ భావన అని దానిని నేరవేర్చడమే తన లక్ష్యమని అడ ుగులు ముందుకు వేస్తున్నారు ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి. నిరంతరం ప్రజాసేవలో ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ నిలిచింది..పేదలు,బడుగు బలహీన వర్గాలకు తన వంతుగా సహాయం అందించాలనే దృఢ సంకల్పంతో గత ఆరు సంవత్సరాల క్రితం పరమదించిన తన తల్లి అయిన ఏలూరి లక్ష్మీదేవి పేరు మీద ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ను డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ప్రారంభించి,సామాజిక అభ్యున్నతికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలే దేవుళ్ళు!సమాజమే దేవాలయం!అంటూ సేవ చేస్తుంది ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్..ప్రతి సంవత్సరం కూడా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలానికి నడకదారిన వెళ్లే



భక్తులకు మార్గం మధ్యలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన వారికి అందుబాటులో ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్టు ద్వారా లక్షల రూపాయలు విలువ చేసే మందులను,ఎనర్జీ డ్రింకులను వారికి అందిస్తూ ప్రజాసేవలో నిమగ్నం అయింది ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్..ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి ఆరు సంవత్సరాల కాలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అతి తక్కువ కాలంలోనే ప్రజల మన్ననలను పొందింది ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్..ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో కోట్లాది రూపాయల విలువచేసే మెడిసిన్స్ ను,శానిటేషన్ నిత్యావసరాలైనటువంటి వస్తువులను ప్రజలకు అందించారు..ట్రస్ట్ ద్వారా వందల మంది క్యాన్సర్ పేషెంట్లకు నిత్యం మందులను వారి చిరునామాలకు పంపిస్తూ వారి ఆరోగ్యానికి అండగా ఉంటుంది.పేదలకు బడుగు బలహీన వర్గాలకు ఆపన్న హస్తం అందిస్తూ ముందుకు సాగుతుంది ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్..అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన ఈ ప్రాంతానికి ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ బాసటగా



నిలుస్తూ ఆపన్నులకు అండగా ఉంటుంది..సహాయం కోరి వచ్చిన వారికి సహాయము చేయడమే దైవత్వం గా భావిస్తూ ఏ కష్ట సమయంలోనైనా వారికి అండగా నిలుస్తూ,వారి కళ్ళలో ఆనందం నింపడమే పరమావధిగా ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ భావిస్తుంది..ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్,బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు అండగా నిలవటమే ఈ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు..పేద ప్రజల కోసం వారి అభివృద్ధి కోసం మా సంస్థ ద్వారా సహాయ సహకారాలను అందించడానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటామని తెలిపారు.దేశ ప్రధాని నరేంద్ర మోడీ అడుగుజాడల్లో నడుస్తూ వారి స్ఫూర్తితో సేవా మార్గంలో నడుస్తున్నామని తెలిపారు..ఏళ్ల తరబడి ఈ ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న అనేక సమస్యలను వాటి పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని డాక్టర్ ఏలూరి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని వచ్చే భక్తులకు సేవ చేయడం ద్వారా శివైక్యం కలుగుతుందని అభిలషించారు..వివిధ రకాల అనారోగ్యాలతో మందులు కూడా కొనలేని వేలమంది పేదలకు తన ట్రస్ట్ ద్వారా మందులను అందిస్తూ వారికి తోడ్పాటుగా ఉంటున్నామన్నారు.. చదువుకోడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అనేకమంది పేద విద్యార్థులకు ఆర్థిక భరోసాగా నిలిచామన్నారు. ఈ ట్రస్ట్ ను తన తల్లి కి గుర్తుగా ఆమె నేర్పిన సేవా భావంతో ఇటువంటి కార్యక్రమాలు చేయడం ద్వారా మానసిక ఆనందాన్ని,సంతృప్తిని కలగజేస్తుందని పేర్కొన్నారు..ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా కేంద్రంలో మొట్టమొదటి సారిగా జరిగిన 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాన్ని ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్రరెడ్డి కి అందించి,ఘనంగా సన్మానించారు..భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజాభ్యుదయానికి పాటుపడాలని అధికారులు నాయకులు ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కి సూచించారు..దేవుని దయతో తన తల్లి అయిన ఏలూరి లక్ష్మీదేవి ఆశీస్సులతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని హామీ ఇచ్చారు..







## పెళ్లిళ్లు.. పూజలు.. పసిడి వేడుకలు



**▸▸ పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**▸▸ నందిగామ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటన**

**నందిగామ,ఆగస్టు 23(మనం న్యూస్):** నందిగామ నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివాహ వేడుకలు, నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమాలకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించి, నూతన వధూవరులు, చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

### నందిగామలో – నూతన వధూవరులకు ఆశీస్సులు :

నందిగామ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో బత్తిన రాంబాబు కుమార్తె వివాహ వేడుకకు కూటమి నేతలతో కలిసి సౌమ్య హాజరయ్యారు. నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

### కంచికచర్లలో వివాహానికి హాజరై

కంచికచర్ల పట్టణంలోని ఓసీ క్లబ్లో వెల్లంకి రామారావు కుమారుడు, బంక ముక్కంటి కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

### వీరులపాడులో – వివాహానికి హాజరై :

నరసింహారావుపాలెంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఐలూరి శ్రీనివాస్రెడ్డి (లేటు) కుమారుడి వివాహ వేడుకకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదివారం హాజరయ్యారు. కూటమి నేతలతో కలిసి నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

### కంచికచర్లలో – నూతన వస్త్ర బహుకరణ – చిన్నారి వైష్ణవికి :

కంచికచర్ల పట్టణంలో గుత్తా వెంకటరత్నం మనవరాలు వైష్వి నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమం సందర్భంగా ఆమె స్వగృహానికి వెళ్లిన సౌమ్య.. కుటుంబ సభ్యులతో కలిసి చిన్నారి వైష్వికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

### మున్నలూరులో – చిన్నారి శరణ్య నూతన వస్త్ర బహుకరణ

మున్నలూరు గ్రామంలో సూర్యదేవర భాస్కరరావు మనవరాలు శరణ్య నూతన వస్త్ర బహూకరణ వేడుకలోనూ సౌమ్య పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నేతలు, స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు సమాజంలో చోటు లేదు

**▸▸ డీసీపీ. బి.లక్ష్మీనారాయణ**

**▸▸ నందిగామ పోలీసుల ఆధ్వర్యంలో ఈగల్ చాలెంజ్ కార్యక్రమం**




**నందిగామ,ఆగష్టు23(మనం న్యూస్):** నందిగామ పోలీసుల ఆధ్వర్యంలో నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈగల్ చాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ రూరల్ డీసీపీ బి. లక్ష్మీనారాయణ, ఐపీఎస్ హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబ వ్యవస్థను, సామాజిక శాంతిభద్రతలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం మనందరి బాధ్యతఅని పేర్కొంటూ, డ్రగ్స్కు వ్యతిరేకంగా పోలీసులు మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని డీసీపీ పిలుపునిచ్చారు. తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను వినియోగించే వ్యక్తులు, విక్రయించే వ్యక్తులు, సరఫరా చేసే వ్యక్తుల గురించి సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ ప్రజలకు ప్రత్యేకంగాఓపెన్ ఛాలెంజ్ ప్రకటిస్తూ, డ్రగ్స్ వినియోగించే వారి గురించి సమాచారం అందించిన వారికి రూ.1,500/- నగదు బహుమతి, అలాగే డ్రగ్స్/మాదక ద్రవ్యాలను విక్రయించే వారి గురించి సమాచారం అందించిన వారికి రూ.5,000/- నగదు బహుమతి అందజేయబడుతుందని తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగంపై సమాచారం ఉన్న ప్రతి ఒక్కరూ ధైర్యంగా పోలీసులకు తెలియజేయాలని, సమాజాన్ని డ్రగ్స్ మహమ్మారి నుండి కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం నందిగామ టౌన్ సీఐ పి. శ్రీను మాట్లాడుతూ, నందిగామ పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. యువతను మాదక ద్రవ్యాల వైపు ఆకర్షించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రగ్స్కు దూరంగా ఉండేలా విద్యార్థులు, యువతలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రజలు పోలీసులకు సహకరించి మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ టౌన్ ఎస్సై కే. సూర్యవంశీ, నందిగామ పోలీస్ స్టేషన్ సిబ్బంది, నందిగామ గ్రామ ప్రజలు మరియు ఇతరులు పాల్గొన్నారు. డ్రగ్స్కు నో చెప్పండి - యువత భవిష్యత్తును కాపాడండి. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

## మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి



**▸▸ డీలిమిటేషన్లో జిల్లాను యూనిట్గా తీసుకోవాలి**

**▸▸ మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్**

**జగ్గయ్యపేట, ఆగస్టు 23 మనం న్యూస్ :** డి లిమిటేషన్ లో జిల్లాను యూనిట్ గా తీసుకొని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు ,గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. రాబోయే డీలిమిటేషన్ ప్రక్రియలో మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, రాష్ట్రాన్ని యూనిట్గా కాకుండా జిల్లాను యూనిట్గా తీసుకుని రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జగ్గయ్యపేట పట్టణంలోని మార్కెట్ యార్డ్ హాల్లో గిరిజనుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలిమిటేషన్లో జిల్లాను యూనిట్గా పరిగణించి మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి. రాష్ట్రాన్ని ఒకే యూనిట్గా తీసుకుంటే మైదాన ప్రాంతాల్లోని గిరిజనులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కకపోయే అవకాశం ఉంది. జిల్లాను యూనిట్గా తీసుకోవడం ద్వారా గిరిజన జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి సామాజిక న్యాయం చేయవచ్చు అని అన్నారు.మైదాన ప్రాంత గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యం, హక్కులు, భవిష్యత్ రాజకీయ అవకాశాల కోసం గిరిజన సమాజం ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

### సమావేశంలో ప్రధాన డిమాండ్లు

రాబోయే డీలిమిటేషన్లో మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి రిజర్వేషన్ అమలులో రాష్ట్రాన్ని యూనిట్గా కాకుండా జిల్లాను యూనిట్గా పరిగణించాలి గిరిజన జనాభా ప్రాతిపదికన తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలిమైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట నియోజకవర్గ గోర్ భాయ్ సంఘం అధ్యక్షులు, సభాధ్యక్షులు లాహోరి బద్దు నాయక్ అధ్యక్షత వహించారు.కార్యదర్శి భూక్యా బద్య నాయక్, దారావత్ బాల్య నాయక్, బాలు నాయక్, లాహోరి ప్రేమనాథ్ నాయక్, ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు. అలాగే పలువురు గిరిజన పెద్దలు, కార్యకర్తలు పాల్గొని మైదాన ప్రాంత గిరిజనుల రాజకీయ హక్కుల కోసం తమ మద్దతు తెలిపారు. అనంతరం మైదానం ప్రాంత గిరిజనుల రాజకీయ రిజర్వేషన్ కోసం నవంబర్ నెలలో జరిగే భారీ బహిరంగ సభకు సంబంధించిన గోడ పత్రికలను కరపత్రాలను ఆవిష్కరించారు.

## అంగరంగ వైభవంగా మఠం శివాలయం ద్వారబంధములు, యంత్ర స్థాపన కార్యక్రమం



**జగ్గయ్యపేట ఆగస్టు 23 మనం న్యూస్:** జగ్గయ్యపేట శ్రీ కంచి కామకోటి సర్వాజ్ఞ పీఠ జగద్గురువుల దివ్య ఆశీస్సులతో పాలేటి ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం మఠం శివాలయం పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి దీనిలో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ నాలుగు ప్రధాన ద్వారబంధములు, యంత్రస్థాపనములు బ్రహ్మశ్రీ ఎల్ విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే గణపతి పూజ పుణ్యాహవాచనం గోపూజ రక్షాబంధనం పంచగవ్యప్రాశనం మండపారాధన అగ్ని ప్రతిష్ట, పూర్ణాహుతి మొదలగు కార్యక్రమాలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి బ్రహ్మశ్రీ చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి, టిడిపి యువ నాయకులు శ్రీరామ్ చిన్నబాబు, పలువురు పుర ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ద్వారా బంధాలకు పాలతో అభిషేకాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు భక్తులకి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.



## గుంతలో చేరిన వర్షపు నీటితో ఇబ్బందులు

**నందిగామ,ఆగష్టు23(మనం న్యూస్):** నందిగామ నుంచి గుడిమెట్ల వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతోంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పటికైనా ఆర్అండ్బి అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు పట్టాలని కోరుతున్నారు

## శాకంబరిగా దర్శనమిచ్చిన ముత్యాలమ్మ అమ్మవారు




**జగ్గయ్యపేట ఆగస్టు 23 మనం న్యూస్:** శ్రావణ మాస ఆదివారాన్ని పురస్కరించుకొని ముత్యాలమ్మ వారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాస 2 వ ఆదివారం సందర్భంగా శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని వివిధ రకముల కూరగాయలు పండ్లతో శాకంబరీ దేవిగా అలంకరించారు. వర్షాలు బాగా పడి పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని మానవులు పశుపక్షాదులు సుఖముగా ఉండవలెనని కోరుకుంటూ అమ్మవారికి ధూప దీప నైవేద్యం మంగళ నీరాజనం సమర్పిం చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించు కున్నరు . ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ గౌరవ సలహాదారులు యర్రా శ్రీనివాసరావు ప్రెసిడెంట్ అప్పన మణికుమార్ వైస్ ప్రెసిడెంట్ నోముల శివకుమార్ సెక్రటరీ కొత్తా రమేష్ కుమార్ జాయింట్ సెక్రెటరీ కొంకిమళ్ల సురేష్ ట్రెజరర్ అప్పన వెంకట పిచ్చయ్య మరియు కమిటీ సభ్యులు చేడే వెంకట శ్రీరంగం, దేవరశెట్టి నాగ ప్రసాద్, తునికి పాటి నాగ మల్లేశ్వరా చారి, ఆరేపల్లి వెంకటేశ్వర్లు ప్రత్యేక ఏర్పాట్లను చేసి భక్తులకు సౌకర్యాలను పర్యవేక్షించారు.అలంకరణ. దేవస్థాన కుమ్మరి శాలివాహన వంశస్తుల చే నిర్వహించారు.

## పలు వివాహ వేడుకలలోపాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించినసామినేని ఉదయభాను, విమలా భానుదంపతులు

**జగ్గయ్యపేట ఆగస్టు 23 మనం న్యూస్‌:** ఆదివారం జగ్గయ్యపేట తదితర ప్రాంతాల్లో జరిగిన పలు వివాహ వేడుకలలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను వారి సతీమణి సామినేని విమలభానులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. జగ్గయ్యపేట నియోజకవర్గం, వత్సవాయి గ్రామం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం నందు జనసేన నాయకులు మూరుమూరి రమాకాంత్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులకు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను వారి సతీమణి సామినేని విమలభాను ఆశీర్వచనాలను అందించారు. అలాగే,జగ్గయ్యపేట పట్టణంలోని ఆటోనగర్ ఎదురుగా ఉన్న పివిఆర్ ఫంక్షన్ హాల్ నందు రిటైర్డ్ టీచర్ బియ్యాల రామారావు కుమార్తె



వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఆ తరువాత జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం నందు మోటమర్రి గంగాధర్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొనీ ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను మరియు సతీమణి సామినేని విమలభానులు ఆశీర్వచనాలను అందించారు. పట్టణంలోని బి కన్వెన్షన్ హాల్లో అనుమంచిపల్లి గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్ కుమారుని వివాహ వేడుకలలో సామినేని ఉదయభాను విమలా బాను లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని మార్కండేయ బజారుకు చెందిన బేతు రంగా లక్ష్మీ దంపతుల కుమార్తె వే ధా శ్రీవల్లి పుష్పాలంకరణ వేడుకలలో సామినేని ఉదయభాను పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.



## నరసింహుని సేవలో సీపీ రాజశేఖర్‌బాబు

**జగ్గయ్యపేట ఆగస్టు 23 మనం న్యూస్‌:** ప్రఖ్యాత పుణ్యక్షేత్రం వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారిని విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుకు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శన అనంతరం వే ద పండితులు వేద ఆశీర్వచనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి ఇందిరా దత్తు తరుపున రాంప్రసాద్, జగ్గయ్య పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్, సిబ్బంది ఆలయ అధికారులు పాల్గొన్నారు.



## ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుడిని లక్ష్యంగా చేసుకుని దాడి చేసి బంగారు ఆభరణాలు, నగదు దోచుకున్న మహిళ అరెస్ట్

- నేరం జరిగిన 36 గంటల్లోనే కేసును ఛేదించిన పొన్నూరు టౌన్ పోలీసులు
- మొత్తం చోరీ సొత్తు రికవరీ




**గుంటూరు పొన్నూరు ఆగస్టు23 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, తెనాలి డీఎస్పీ బి. జనార్ధనరావు, పర్యవేక్షణలో పొన్నూరు టౌన్ సీఐ ఆర్.ఎస్. కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుడిపై దాడి చేసి బంగారు ఆభరణాలు, నగదు దోచుకున్న కేసును అత్యంత వేగంగా ఛేదించారు.కే సు వివ రాల్లోకి వెళితే...ఫిర్యాదుదారు రత్తయ్య ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న విషయం నిందితురాలికి ముందుగానే తెలుసు.గతంలో ఫిర్యాదుదారుడి పొలంలో నిందితురాలు పనిచేసినందున ఆమెకు ఆయనతో పరిచయం ఉంది.ఈ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని నిందితురాలు గత కొన్ని రోజులుగా ఫిర్యాదుదారుడి ఇంటిపై నిఘా పెట్టి, ఇంట్లోని బీరువా ఉన్న ప్రదేశాన్ని కూడా గమనించింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధుడిని లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేయాలని ముందుగానే పథకం వేసుకుంది.21.08.2026 మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో నిందితురాలు ఒక సంచిలో కారం పొట్లం, బండరాయి పెట్టుకుని ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లింది.తలుపు తీయగా, తెలిసిన వారికి ఇల్లు అద్దెకు కావాలని, మంచినీళ్లు కావాలని చెప్పి ఇంట్లోకి ప్రవేశించింది.ఫిర్యాదుదారు మంచినీళ్లు తెచ్చి ఇవ్వగా, ఇంట్లో మరియు పరిసర ప్రాంతాల్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న నిందితురాలు ఇదే అదునుగా భావించి ఫిర్యాదుదారుడి కళ్లలో కారం కొట్టింది. ఆయన అరవకుండా నోటిని చేతితో గట్టిగా నొక్కి,గొంతు పట్టుకుని కిందపడేసి దాడి చేసింది. అనంతరం బెడ్రూమ్లోని బీరువా వద్దకు వెళ్లి అందులో ఉన్న బంగారు ఆభరణాలు, నగదును తీసుకుని అక్కడి నుంచి పరారైంది.చోరీకి గురైన సొత్తు1. బంగారు గాజులు - 4, 2. బంగారు చెవి కమ్మలు - 1 జత, 3. బంగారు సాదా ఉంగరాలు - 2, 4. ఎరుపు రాళ్లు కలిగిన బంగారు చెవి దిద్దులు - 1 జత, 5. నగదు - రూ.5,500, 36 గంటల్లోనే నిందితురాలి అరెస్ట్ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పొన్నూరు టౌన్ సీఐ ఆర్.ఎస్. కిషోర్ కుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని సాంకేతిక నిపుణుల సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించారు. పటిష్టమైన దర్యాప్తు,సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితురాలిని నేరం జరిగిన 36 గంటల్లోనే అరెస్ట్ చేశారు. నిందితురాలి వద్ద నుంచి చోరీకి గురైన మొత్తం సొత్తును రికవరీ చేసి, తదుపరి నిందితురాలిని రిమాండ్కు తరలించారు.కేసును వేగవంతంగా ఛేదించి, నిందితురాలిని అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన మొత్తం సొత్తును రికవరీ చేసిన పొన్నూరు టౌన్ సీఐ ఆర్.ఎస్.కిషోర్ కుమార్ మరియు పోలీసు సిబ్బందిని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ అభినందించారు.ఒంటరిగా నివసించే వృద్ధులు,మహిళలు అపరిచిత వ్యక్తులను ఇంట్లోకి అనుమతించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా పోలీసులు సూచించారు.

## ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ,ఆగష్టు,23,(మనం న్యూస్):** ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# ఎయిడ్స్, టిబి వ్యాధులను అరికడదాం



**కంచికచర్ల ఆగస్టు 23(మనం న్యూస్):** ప్రాణాంతకమైన వ్యాధులైన ఎయిడ్స్ మరియు టిబి మహమ్మరి వ్యాధుల ను పారదోలదం అని ఓ ఆర్ డబ్ల్యు పూరమాలక్ష్మి కొప్పాళ్ళ వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కెవిఎంఎస్, ఏపీ జిల్లా ఆరోగ్య వైద్య శాఖ వీరి సంయుక్త ఆధ్వర్యంలో కంచికచర్లబస్టాండ్ ఆవరణలో ఈ వ్యాధులపై కళాభారతి బృందం వారిచే హెచ్ఐవి టిబి వ్యాధులపై పాటల రూపంలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో నృత్య ప్రదర్శన తోపాటు నాటకమును ఆదివారం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాకారులతో పాటు ఓఆర్డబ్ల్యూ పూరమాలక్ష్మి కొప్పాళ్ళ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ భవన మరమ్మతులకు పలువురి చేయూత



**వీరులపాడు ఆగష్టు 22, మనం న్యూస్:** వీరులపాడు మండలంలోని జుజ్జూరులో ఉన్న ప్రెస్ క్లబ్ ఆఫ్ వీరులపాడు కార్యాలయ భవనం మరమ్మతులకు గురికావడంతో భవనాన్ని పునరుద్ధరించేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. ఇటీవల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వర ప్రసాద్ ఆధ్వర్యంలో విలేకరులంతా కలిసి పలువురు పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు భవనం పరిస్థితిని వివరించారు.భవన మరమ్మతులకు ఆర్థిక సహాయం అందించేందుకు పలువురు పార్టీల నాయకులు, అధికారులు ముందుకు రావడంతో ఆదివారం నుంచి మరమ్మతు పనులను ప్రారంభించారు. ప్రెస్ క్లబ్ భవనం మరమ్మతులకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రెస్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా భవన మరమ్మతులకు మరింత ఆర్థిక సహాయం అవసరమైనందున మరికొందరు దాతలు కూడా ముందుకు వచ్చి సహకరించాలని ప్రెస్ క్లబ్ సభ్యులు కోరారు. ఇప్పటికే సహాయం అందించిన నాయకులు, అధికారులు, దాతలకు ప్రెస్ క్లబ్ ఆఫ్ వీరులపాడు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జయంతి జడ్పీ హైస్కూల్లో సైబర్ నేరాలపై అవగాహన

**వీరులపాడు ఆగష్టు 22, మనం న్యూస్:** వీరులపాడు మండలం, జయంతి గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో వీరులపాడు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రోజున విద్యార్థులకు సైబర్ నేరాలు మరియు మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వీరులపాడు ఎస్.ఐ బి. అభిమన్యు విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న Task&Based Frauds, Online Job/Investment Frauds, OTP UPI Frauds, Fake Links, Social Media Frauds Vారించి వివరించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఖ్కీలు, బ్యాంకు వివరాలు, పాస్వర్డు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.అలాగే మొబైల్ ఫోన్ మరియు సోషల్ మీడియాను సురక్షితంగా వినియోగించడం, వ్యక్తిగత ఫోటోలు/సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకపోవడం, మహిళలు మరియు బాలికలపై ఆన్లైన్ వేధింపులు ఎదురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైన సందర్భంలో ఆలస్యం చేయకుండా 1930 ఇఢ్బుట ఇటజీర్ఘ్ఫు ఫ్ఛజూఇజూజ్ఫ్బ ద్వారా ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపకులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సైబర్ భద్రతకు సంబంధించిన పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు.




# అమరజీవి టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘన నివాళులు

**గుంటూరు ఆగస్టు : 23 (మనం న్యూస్ ప్రతినిధి):** ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి సందర్భంగా రాష్ట ప్రజలు ఆయన సేవలను స్మరించుకుంటున్నారు. నిర్భయత్వానికి, త్యాగానికి ప్రతీకగా నిలిచిన ప్రకాశం పంతులు గారు స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించారు.1928లో సైమన్ కమిషన్కు వ్యతిరేకంగా మద్రాస్లో జరిగిన నిరసనలో బ్రిటిష్ పోలీసుల తుపాకులకు ఎదురుగా తన ఛాతీని చూపిస్తూ కాల్చండి నా గుండెల్ని అని నినదించిన సాహసోపేత ఘట్టం భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచింది.ప్రముఖ న్యాయవాదిగా, పత్రికా సంపాదకుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన, ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, అనంతరం ఏర్పడిన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేశారు.ప్రజల హితమే ధ్యేయంగా, నిజాయితీకి నిలువెత్తు రూపంగా ప్రకాశం పంతులు గారు అందించిన సేవలు భావితరాలకు ఎప్పటికీ ఆదర్శనీయం.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీస్ ఉత్తర్వుల మేరకు గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, ప్రకాశం పంతులు గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పి ంచారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు దేశభక్తి, ధైర్యసాహసాలు, ప్రజాసేవను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ఐలు, ఏ ఆర్ ఎస్ ఐ,పోలీస్ స్టాప్ పాల్గొన్నారు.



# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం నిర్వహిస్తాం



జిల్లా ఇంచార్జ్ కలెక్టరు ఎం నవీన్

**మచిలీపట్నం: ఆగస్టు 23, (మనం న్యూస్):** 24వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎం. నవీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక-కార్యక్రమం జరుగుతుందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు ఝ్ఘ్బజూౌట్చఝ్.్చఇఃజౌ.జీ వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ఆర్టీవో కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాం. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా ఇంచార్జ్ కలెక్టర్ కోరారు.

# అన్నేపాక సుందర్ రావు కి ఘన నివాళులు అర్పించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



**జగ్గయ్యపేట ఆగస్టు 23 మనంన్యూస్:** జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ సీనియర్ న్యాయవాద అన్నేపాక సుందర్ రావు అకాల మరణం పట్ల జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట క్రాస్రోడ్లోని వారి స్వగృహానికి వెళ్లి అన్నేపాక సుందర్ రావు పార్థివదేహాన్ని సందర్శించి తన్నీరు నాగేశ్వరరావు , వారి సతీమణి తన్నీరు సుధారాణి లు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సుందర్ రావు న్యాయవృత్తిలో అందించిన సేవలను తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. న్యాయవాదిగా ఎంతోకాలం ప్రజలకు, న్యాయవ్యవస్థకు సేవలందించిన ఆయన మరణం జగ్గయ్యపేట న్యాయవాద వర్గానికి, ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ అపారమైన విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని తన్నీరు నాగేశ్వరరావు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పసుపులేటి సత్య శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బూడిది నరసింహారావు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు ఓర్సు వెంకటరాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, తిరుమలగిరి గ్రామ్ పార్టీ అధ్యక్షుడు కరిసే ఇజ్రాయిల్, జగ్గయ్యపేట మండల రైతు విభాగ అధ్యక్షులు గూడపాటి శేషగిరిరావు, నియోజకవర్గ ఐటీ వింగ్ బండి రంజిత్ తదితరులు నివాళులు అర్పించారు.

# అన్నెపాక సుందర రావుకు నివాళులర్పించిన కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం



**జగ్గయ్యపేట ఆగస్టు 23 మనం న్యూస్:** బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ సీనియర్ అన్నెపాక సుందర్రావు ఆదివారం మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాక సుందర రావు భౌతికకాయానికి మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం శ్రీ రఘురామ్ నివాళులు అర్పించారు. షేర్ మహమ్మద్ పేట క్రాస్ రోడ్లోని అన్నెపాక సుందర రావు కాంప్లెక్స్ వద్ద ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన తనయులు అన్నెపాక ప్రపుల్ల శ్రీకాంత్ ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా నెట్టెం శ్రీ రఘురామ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగి, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి అన్నెపాక సుందర రావు విశేష కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గంలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. అదేవిధంగా న్యాయవాదిగా, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పేదలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం అందించేందుకు సుందర రావు నిరంతరం కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. సుందర రావుతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అన్నెపాక సుందర రావు ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని నెట్టెం రఘురామ్ ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గింజుపల్లి రమేష్, అన్నెపాక కాంతారావు, అన్నెపాక దుర్గారావు, పసుమర్తి జగ్జీవన్ రావు, అన్నెపాక కిషోర్ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికెల్ క్యాంపు



**గుంటూరు ఆగస్టు: 23 (మనం న్యూస్ ప్రతినిధి):** లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్ గుంటూరు వారిచే చేపడుతున్న ఉచిత మెగా మెడికెల్ క్యాంపు లలో భాగం పెదనందిపాడు గ్రామం నందు ఆదివారం 23/0 8/26 న ఉ. 9 గం నుండి మ. 3 గం వరకు అశోక ఉన్నత పాఠశాల ప్రాంగణం, పెదనందిపాడు నందు ఉచిత మెగా మెడికెల్ క్యాంపు ను నిర్వహించారు. ఈ క్యాంపు ను 245 మందికి పైగా ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని లలిత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవశర్మ తెలిపారు.ఈ క్యాంపు లోఉచితంగా బి.పి, షుగరు ఇసీజి పరీక్షలు చెసి కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్ కన్సల్టేషన్ సేవలను అందించి సంబంధిత జబ్బులు గురించి వివరించి, సలహాలు - సూచనలు తెలియచేసారు. ఉచితంగా మందులు పంపిణీ చేారు.ఈ క్యాంపు నందు పోసా విష్ణు తేజ కార్డియాలజీ డాక్టర్ సందీప్ జనరల్ మెడిసిన్ డాక్టర్ శరత్ ఆర్థోపెడిక్స్ డాక్టర్,పెదనందిపాడు గ్రామ పెద్దలు పోపూరి నాగేశ్వర రావు,పోపూరి లక్ష్మి నారాయణ, వరగాని వైద్యుడు షేక్ హజరత్ ఆలీ, నర్సింగ్ స్టాఫ్,పారామెడికల్ స్టాఫ్,హాస్పిటల్ సిబ్బంది కలసి పాల్గోనారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

## కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు నగరపాలక సంస్థ ఆగస్టు : 23 (మనం ప్రతినిధి):** ఆగస్ట్ 24వ తేది సోమవారం గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా జిఎంసి విభాగాధిపతులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించిన జిల్లా వైద్య అధికారి



**గుంటూరు, ఆగస్టు23 (మనం న్యూస్ ప్రతినిధి):** ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని తన ఛాంబర్ నందు డా.కే.విజయలక్ష్మి ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి. నివాళు లర్పించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు గారు ఒక నిర్భయ స్వాతంత్ర్య సమరయోధులని, నీతి,నిజాయితీ మరియు ధైర్యానికి మారుపేరని, మహాత్మాగాంధీ నిర్వహించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరడానికి తన న్యాయవాద వృత్తికి వదులుకున్నారని, ఆయన ధైర్యానికి ఆంధ్రకేసరి బిరుదును సొంతం చేసుకున్నారని,స్వరాజ్య పత్రికను స్థాపించి,ఉప్పు సత్యాగ్రహం మరియు క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా మాల్గొన్నారని,ఆయన క్రొత్త ఆంధ్ర రాష్టానికి తొలి ముఖ్యమంత్రి అని, ఆయన జీవితాన్ని మనం ఆదర్శం గా తీసుకోవాలని తెలియజేసినారు.

# తిరుమల శ్రీ వారిని దర్శించుకున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులు



**గుంటూరు పశ్చిమ ఆగస్టు : 23 (మనం న్యూస్ ప్రతినిధి):** శ్రీ భ్రమర టౌన్ షిప్స్ అధినేత గళ్ళా రామచంద్రరావు, జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులకు వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో ప్రతి సంవత్సరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని,గళ్ళా రామచంద్రరావు,జన్మదినాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.

# మచిలీపట్నంలో టంగుటూరి పకాశం పంతులు జయంతి సందర్భంగా ఘన నివాళులు

**మచిలీపట్నం, ఆగస్టు 23,(మనం న్యూస్):** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) హాలులో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం, ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత,



ధైర్యసాహసాలు మరియు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు చేసిన కృషిని అధికారులు స్మరించుకున్నారు.బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య ఉద్యమంలో టంగుటూరి ప్రకాశం పంతులు పోషించిన కీలక పాత్రను, ప్రజల హక్కుల కోసం ఆయన సాగించిన నిరంతర పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రజా సేవలో ఆయన చూపిన ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘన నివాళులు అర్పించారు.





# నేరాలకు స్వస్తి పలికి. చట్టబద్ధమైన జీవనం సాగించాలి,రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి గుంటూరు జిల్లా పోలీసుల ప్రత్యేక కౌన్సిలింగ్

**గుంటూరు ఆగస్టు : 23 (మనం న్యూస్ ప్రతినిధి )**గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు,నేరచరిత్ర కలిగిన వ్యక్తులు,చెడు నడత కలిగిన వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ. గతంలో జరిగిన తప్పులను పక్కనపెట్టి, ఇకపై చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. ఎలాంటి నేరాలకు,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులు,సమాజం గర్వించే విధంగా మంచి ప్రవర్తనతో జీవించాలని హితవు పలికారు. ప్రజల ప్రశాంతతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించినా లేదా నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.రౌడీ షీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై గుంటూరు జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. అదే సమయంలో నేరాలకు దూరంగా ఉంటూ చట్టబద్ధమైన జీవనం సాగించే వారికి పోలీసుల నుంచి అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.



# పి.జి.ఆర్.ఎస్‌లో అర్జీలు అందించండి

- పరిష్కారం పొందండి
- పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100
- టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి
- ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చు
- క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చు



**గుంటూరు, ఆగస్టు 23 : (మనం న్యూస్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను ప్రతీ సోమవారం జిల్లా, మండల స్థాయిలో అన్ని కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. మీ కోసం వెబ్ సైట్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించవచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్ ఞ్ఞుజూౌట్చుర్ఘు.చ్ఇ:జౌరి.జ్షీ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని,ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని చెప్పారు.

# సహకార బ్యాంకులను నిర్వీర్యం చేయొద్దు

- కేంద్రం, ఆర్బీఐ జోక్యం రాజ్యాంగ విరుద్ధం
- చలసాని రాఘవేంద్రరావు

**గాంధీనగర్ ఆగస్టు 23 మనం న్యూస్:** సహకార బ్యాంకుల స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవాలని, కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) విధిస్తున్న అనాలోచిత ఆంక్షలను తక్షణమే ఉపసంహరించుకుని ప్రజలకు కో-ఆపరేటివ్ బ్యాంక్ సేవలను మరింత విస్తరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ అధ్యక్షులు చలసాని రాఘవేంద్రరావు డిమాండ్ చేశారు. సహకార బ్యాంకులపై కేంద్రం పెత్తనం రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార సంస్థలు ... ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యంతో ఏర్పడినవని, వాటి నిర్వహణలో రిజర్వ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ జోక్యం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ 11వ వార్షిక సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలను ఆదివారం స్థానిక ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. చలసాని మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) ప్రకారం సహకార సంస్థలను ఏర్పాటు చేసుకోవడం పౌరుల ప్రాథమిక హక్కు అని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ 7 ప్రకారం 'సహకారం' అనేది రాష్ట్రాల జాబితాలోని అంశమని, దీనిపై చట్టాలు చేసే అధికారం కేవలం రాష్ట్రాలకే ఉంటుందని పేర్కొన్నారు. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాన్ని సవరించి, సహకార బ్యాంకుల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం చట్టవిరుద్ధమని మండిపడ్డారు. పార్లమెంటు సభ్యులకే లేని అర్హతలను పట్టణ బ్యాంకుల డైరెక్టర్లకు వర్తింపజేయడం హాస్యాస్పదమని ఆయన అభిప్రాయపడ్డారు. డైరెక్టర్ల పదవీకాలాన్ని పరిమితం చేయడాన్ని కూడా తప్పుబట్టారు. 24 ఏళ్లుగా కొత్త పట్టణ బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ లైసెన్సులు ఇవ్వడం లేదని, అమిత్ షా ప్రకటించిన ప్రతి పట్టణంలో ఒక సహకార బ్యాంకు అనే లక్ష్యానికి ఆర్బీఐ నిబంధనలు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. సహకార చట్టాలకు భిన్నంగా బ్యాంకింగ్ నిబంధనలను బలవంతంగా రుద్దేందుకు ఏర్పాటు చేసిన 'మోడల్ బైలా రూపకల్పన కమిటీ' వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) వసూలు చేస్తున్న ప్రీమియం భారంపై ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో 10 పైసల నుంచి 12 పైసలకు పెంచిన ప్రీమియంను ఇప్పుడు 8 పైసలకు తగ్గించాలని కోరారు. ఈ సంస్థ వద్ద రూ. 2.5 లక్షల కోట్ల నిధులు ఉన్నప్పటికీ, కేవలం రూ. 5 లక్షల వరకు మాత్రమే డిపాజిట్లకు రక్షణ కల్పించడం అన్యాయమని, మొత్తం డిపాజిట్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 44 పట్టణ బ్యాంకుల్లో 8 బ్యాంకులకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ కమిటీలతో నడపడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే, అమరావతిలో ఫెడరేషన్ కార్యాలయం, శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే (ఎకరం రూ. 75 లక్షలు) స్థలం కేటాయించాలని కోరారు. .సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను అడ్డుకోవడానికి చట్టపరమైన పోరాటంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పిస్తామని మహాజన సభ తీర్మానించింది ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ కార్యదర్శి షేక్ అబ్దుల్ జిలాని,ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కె.అచ్యుతరామారావు, శారదాంబ మహిళా బ్యాంక్ అధ్యక్షురాలు, ఫెడరేషన్ డైరెక్టర్ లావణ్య దేవి పాల్గొన్నారు.



# సహకార సంఘాలు రైతుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరించాలి

- కె డి సి సి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం




**జగ్గయ్యపేట ఆగస్టు 23 మనం న్యూస్:** సహకార సంఘాలు రైతులకు మరింత చేరువుగా పనిచేయాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరించాలని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ మాజీ మంత్రి నెట్టెం రఘురాం అన్నారు. నవాబుపేట నూతన పీఏసీఎస్ చైర్మన్గా చింతా రవికుమార్ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం , నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరామ్ చిన్నబాబు లు హాజరై నూతన చైర్మన్ను అభినందించారు. ఈ సందర్భంగా నెట్టెం శ్రీ రఘురాం మాట్లాడుతూ, సహకార వ్యవస్థలో పీఏసీఎస్లు రైతులకు మరింత చేరువగా పనిచేయాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరించాలని సూచించారు. చింతా రవికుమార్ నాయకత్వంలో నవాబుపేట పీఏసీఎస్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ గోరంట్ల రాయప్ప , డైరెక్టర్ జంగాల కోటేశ్వరమ్మ, నీటి సంఘం అధ్యక్షులు గింజుపల్లి వెంకటయ్య , తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నంబూరి వెంకటేశ్వరరావు , తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తవరపు వెంకటేశ్వరరావు , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జామ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చింతా రవికుమార్ కి పలువురు నాయకులు, కార్యకర్తలు, సహకార సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# నిరాడంబరత, ధైర్యం, పట్టుదలకు ప్రతీక ప్రకాశం పంతులు

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,ఆగస్టు, 23,(మనం న్యూస్):** నిరాడంబరత, నిజాయితీ, పట్టుదల, క్రమశిక్షణ, ధైర్యసాహసాలకు ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులుగారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి జీవితాంతం ప్రజల కోసం పనిచేసిన మహోన్నత వ్యక్తి ప్రకాశం పంతులు అని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ పాలకుల ఎదుట నిర్భయంగా నిలిచి, తన సాహసాన్ని చాటుకున్న ప్రకాశం పంతులు తెలుగువారి ధైర్యసాహసాలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే పెద్దపీట వేసిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనియమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.



# త్రాగునీటికి పరీక్షలు నిర్వహించిన అధికారులు

**నందిగామ, ఆగష్టు23(మనం న్యూస్):** నందిగామ లో గల వాటర్ ట్యాంక్ లను మునిసిపల్ అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం వాటర్ ట్యాంక్ లను శుభ్రపరచినారు. వర్షాలు కురవటంతో నీరు మురికిగా రావటం మరియు నీటిలో క్రిములు సంచరించటంతో మునిసిపల్ సిబ్బంది వాటర్ ట్యాంకులను శుబ్రపరచ దలిచారు.అలాగె ప్రతి నెలకు ఒకసారి శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ చల్లుతారు.ఈ సారి మునిసిపల్ కమిషనర్ లోవరాజు మరియు ఏ.ఈ ఆదేశాల మేరకు త్రాగు నీటిని క్లోరినెషన్ పరీక్షలు నిమిత్తం నీటిని గుంటూరులోని పరీక్షశాలకు పంపి, వాటికి సంబంధించిన రిపోర్టులను పరిశీలించిన తరువాత మరల వాటర్ ట్యాంకులను నీటితో నింపినారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు వహించినారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, రంగారావు,వాటర్ ట్యాంక్ వర్కర్లు పాల్గొన్నారు.




# అన్నేపాక సుందర్రావు భౌతికాయానికి నివాళులర్పించిన శ్రీరామ్ చినబాబు



**జగ్గయ్యపేట ఆగస్టు 23 మనం న్యూస్:** పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత అన్నెపాక సుందర రావు పార్థివదేహాన్ని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీరామ్ ధనుంజయ ( చిన్న బాబు) సందర్శించి నివాళులర్పించారు. ఐదు సార్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా వారు చేసిన సేవలు, తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా పార్టీ ఉన్నతికి వారు చేసిన కృషి మరువలేనివని అన్నారు. సుందర రావు మృతి పార్టీకి తీరని లోటని గొప్ప నేతను కోల్పోయామని ఈ సందర్భంగా శ్రీరామ్ చిన్నబాబు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# గుంతలో చేరిన వర్షపు నీటితో ఇబ్బందులు

**నందిగామ,ఆగష్టు23(మనం న్యూస్):** నందిగామ నుంచి గుడిమెట్ల వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతోంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్బి అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు పట్టాలని కోరుతున్నారు

